ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 310 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
బుధవారం 11 జూన్ 2025
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

ప్రధానితో భేటీ కావాలంటే ఆర్టీపీసీఆర్ టెస్టు తప్పనిసరి!

దేశంలో కరోనా కేసులు 7వేలు దాటడంతో ప్రధాని నరేంద్రమోదీని కలిసే మంత్రులు, ఇతర ప్రముఖులు తప్పనిసరిగా ఆర్టీపీసీఆర్ టెస్టులు చేయించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

జూన్ 11, (రిపబ్లిక్ న్యూస్): దేశంలో కొవిడ్ వ్యాప్తి రోజురోజుకీ పెరుగుతోంది. తాజాగా ఈ వైరస్ బారిన పడినవారి సంఖ్య 7వేలు దాటింది. దేశంలో కేసులు పెరుగుతుండడంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్యశాఖ సూచించింది. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీని కలిసే మంత్రులు, ప్రభుత్వ అధికారులు, ఇతర ప్రముఖులు తప్పనిసరిగా ఆర్టీపీసీఆర్ పరీక్ష చేయించుకోవాలని పీఎంఓ సూచించినట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి.

రాష్ట్రాల వారీగా కొవిడ్ కేసులు ఇలా..

ఇందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ బుధవారం విడుదల చేసిన అధికారిక తాజా డేటా ప్రకారం.. గత 24 గంటల్లో దేశంలో 306 కొత్త కేసులు నమోదవడంతో ప్రస్తుతం యాక్టివ్ కేసుల సంఖ్య 7,121లకు చేరింది. దేశంలో కొవిడ్ మృతుల సంఖ్య 74కు పెరిగింది. కేరళలో అత్యధికంగా 2,223 యాక్టివ్ కేసులు ఉండగా.. గుజరాత్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్ తర్వాతి స్థానాల్లో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. కరోనా కొత్త వేరియంట్లపై భయాందోళనలు అవసరం లేదని.. ఇన్ఫెక్షన్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

డేటాబోర్డులో వెల్లడించిన సమాచారం ప్రకారం.. దేశంలో మొత్తం 7,121 కేసులు ఉండగా.. కేరళలో అత్యధికంగా 2,223 కేసులు నమోదయ్యాయి. గుజరాత్ 1,223, ఢిల్లీ 757, పశ్చిమబెంగాల్ 747, మహారాష్ట్ర 615, కర్ణాటక 459, ఉత్తరప్రదేశ్ 229, తమిళనాడు 204, రాజస్థాన్ 138, హరియాణా 125, ఆంధ్రప్రదేశ్ 72, మధ్యప్రదేశ్ 65, మహారాష్ట్ర 615, ఛత్తీస్‌గఢ్, 48, బిహార్ 47, ఒడిశా 41, సిక్కిం, పంజాబ్ ఒక్కో రాష్ట్రంలో 33 చొప్పున కేసులు, తెలంగాణ 11, పుదుచ్చేరి, ఝార్ఖండ్లలో చెరో 10 కేసులు, జమ్మూకశ్మీర్ 9, అస్సాం, గోవాల్లో 6, చండీగఢ్, ఉత్తరాఖండ్ 3, హిమాచల్ ప్రదేశ్ 2, మణిపుర్, త్రిపుర చెరో కేసు నమోదయ్యాయి.

పొదిలిలో రాళ్లదాడి చేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షిస్తాం:మంత్రి లోకేశ్

పొదిలిలో వైకాపా సైకోల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మంత్రి నారా లోకేశ్ తెలిపారు.

అమరావతి, జూన్ 11, (రిపబ్లిక్ న్యూస్): పొదిలిలో వైకాపా సైకోల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళలపై దాడి చేస్తారా అని ప్రశ్నించారు. రాళ్లదాడి చేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షిస్తామన్నారు. "జగన్ మొన్న తెనాలి గంజాయి బ్యాచ్ రౌడీషీటర్లకు ఓదార్పు యాత్ర చేశారు. ఇప్పుడేమో మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన వారికి మద్దతిస్తున్నారు. సొంత తల్లి, చెల్లిని బయటకు గెంటేసి.. కోర్టుకు ఈడ్చారు. పొదిలిలో వైకాపా చేసిన దాడికి జగన్ క్షమాపణ చెప్పాలి" అని లోకేశ్ అన్నారు.

జగన్ ఉన్మాద మనస్తత్వానికి ఇది నిదర్శనం:దేవినేని ఉమ

పొదిలిలో మహిళలపై సైకోలతో దాడి చేయించడం దుర్మార్గమని తెదేపా నేత, మాజీ మంత్రి దేవినేని ఉమ అన్నారు. పొదిలిలో రాళ్లదాడి.. జగన్ ఉన్మాద మనస్తత్వానికి నిదర్శనమని విమర్శించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళలపై రాళ్ల దాడి చేశారని మండిపడ్డారు. పోలీసుల తలలు పగలగొట్టిన వైకాపా సైకో మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

కాళేశ్వరం డాక్యుమెంట్లన్నీ బయటపెడతా:సీఎం రేవంత్ రెడ్డి

తాను ఉన్నంత వరకు కాంగ్రెస్లోకి మాజీ సీఎం కేసీఆర్ కుటుంబానికి ఎంట్రీ లేదని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

దిల్లీ, జూన్ 11, (రిపబ్లిక్ న్యూస్): తాను ఉన్నంత వరకు కాంగ్రెస్లోకి మాజీ సీఎం కేసీఆర్ కుటుంబానికి ఎంట్రీ లేదని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రానికి ఆ కుటుంబమే ప్రధాన శత్రువని మండిపడ్డారు. ఢిల్లీలో మీడియాతో నిర్వహించిన చిట్చాట్లో సీఎం మాట్లాడారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణ, శాఖల కేటాయింపుపై ఢిల్లీలో ఎలాంటి చర్చ జరగలేదని సీఎం చెప్పారు. హైదరాబాద్ వచ్చాక అందరితో సంప్రదించి శాఖలు నిర్ణయిస్తామని తెలిపారు. కర్ణాటక కులగణనపై మాత్రమే అధిష్ఠానం వద్ద చర్చలు జరిగాయన్నారు. కాళేశ్వరంపై రెండు రోజుల్లో మీడియా సమావేశం నిర్వహిస్తానని రేవంత్రెడ్డి వెల్లడించారు. కాళేశ్వరం డాక్యుమెంట్లు అన్నింటినీ బయటపెడతానన్నారు. తెలంగాణకు సంబంధించి కేంద్రంలో అన్నింటికీ అడ్డుపడుతోంది కిషన్రెడ్డేనని ఆరోపించారు. రాష్ట్రంలోని ఏ ఒక్క ప్రాజెక్టుకూ ఆయన నిధులు సాధించలేదని విమర్శించారు.

డ్రగ్స్ తీసుకుంటే ఎంతటి ప్రముఖులైనా చర్యలు తప్పవు: తెలంగాణ పోలీస్

చట్టాలను ధిక్కరించి ఎలా పడితే అలా వ్యవహరిస్తామంటే చూస్తూ ఊరుకోమని, లాఠీ ఝుళిపించి గాడిన పెట్టాల్సి వస్తుందని తెలంగాణ పోలీసులు హెచ్చరించారు.

హైదరాబాద్, జూన్ 11, (రిపబ్లిక్ న్యూస్): చట్టాలను ధిక్కరించి ఎలా పడితే అలా వ్యవహరిస్తామంటే చూస్తూ ఊరుకోమని, లాఠీ ఝుళిపించి గాడిన పెట్టాల్సి వస్తుందని తెలంగాణ పోలీసులు హెచ్చరించారు. ఎంతటి ప్రముఖులైనా డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ పోలీస్ తమ 'ఎక్స్' ఖాతాలో పోస్టు పెట్టింది. మంగళవారం రాత్రి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్న రిసార్ట్పై చేవెళ్ల పోలీసులు దాడి చేసిన ఫొటోలను షేర్ చేసింది. సింగర్ మంగ్లీ బర్త్డే పార్టీలో విదేశీ మద్యం, గంజాయి లభ్యమయ్యాయి. పుట్టినరోజు సందర్భంగా రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఈర్లపల్లి శివారులోని రిసార్టులో స్నేహితులకు మంగళవారం రాత్రి ఆమె పార్టీ ఇచ్చారు. ఈ వేడుకలకు సుమారు 50 మంది వరకు మంగ్లీ కుటుంబసభ్యులు, స్నేహితులు హాజరయ్యారు. వీరిలో సినీ పరిశ్రమకు చెందిన వారు కూడా ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో రాత్రి 2 గంటల సమయంలో ఎస్వోటీ పోలీసులు రిసార్టుపై దాడులు చేశారు. సింగర్ మంగ్లీ, పార్టీ నిర్వాహకుడు, రిసార్ట్ నిర్వాహకుడు, టెస్టుల్లో గంజాయి పాజిటివ్గా తేలిన ఒక వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

హనీమూన్ హత్య కేసు... నేరాన్ని అంగీకరించిన సోనమ్...!

భర్త హత్య కేసులో తన ప్రమేయం ఉందని సోనమ్ రఘువంశీ పోలీసుల విచారణలో చెప్పినట్లు సమాచారం.

షిల్లాంగ్, జూన్ 11, (రిపబ్లిక్ న్యూస్): సంచలనం సృష్టించిన మేఘాలయ హనీమూన్ హత్య కేసులో నిందితురాలు సోనమ్ రఘువంశీ తన నేరాన్ని అంగీకరించినట్లు తెలుస్తోంది. తన భర్త రాజా రఘువంశీ హత్యలో తన ప్రమేయం ఉందని ఆమె పోలీసుల విచారణలో చెప్పినట్లు సమాచారం. ఈ మేరకు సిట్ వర్గాలు వెల్లడించాయి.

ఈ కేసులో సోనమ్తో పాటు ఇతర నిందితులను బుధవారం షిల్లాంగ్ తీసుకొచ్చారు. అక్కడ సిట్ బృందం వీరిని కేసు గురించి ప్రశ్నించింది. ఆ సమయంలో సోనమ్ తన నేరాన్ని అంగీకరించినట్లు తెలుస్తోంది. దీంతో ఆమె వాంగ్మూలాన్ని మేజిస్ట్రేట్ ఎదుట రికార్డ్ చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. దాన్ని వీడియోటేప్ చేయాలని పోలీసులు భావిస్తున్నారు. ఈ కేసు దర్యాప్తునకు ఆమె వాంగ్మూలం కీలకంగా మారనుంది. ఈ రోజే నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నారు.

ఆమెను ఉరితీయాలి: సోనమ్ సోదరుడు

మరోవైపు ఈ హత్య కేసుపై సోనమ్ సోదరుడు గోవింద్ మీడియాతో మాట్లాడారు. "ఇప్పటివరకు ఉన్న ఆధారాలు చూస్తుంటే.. ఆమెనే ఈ హత్యకు పాల్పడినట్లు అర్థమవుతోంది. ఈ కేసులో ఉన్న నిందితులందరూ రాజ్ కుశ్వాహాకు తెలిసినవాళ్లే. ఈ వార్త తెలిసిన తర్వాత మేం సోనమ్ సంబంధాలు తెంచుకున్నాం. రాజా రఘువంశీ కుటుంబానికి కూడా క్షమాపణలు తెలియజేస్తున్నాం. ఈ కేసులో సోనమ్ గనుక దోషిగా తేలితే ఆమెను ఉరితీయాలి" అని గోవింద్ అన్నారు. రాజా రఘువంశీ కుటుంబం మధ్యప్రదేశ్లోని ఇందౌర్లో ట్రాన్స్పోర్టు వ్యాపారం చేస్తోంది. మే 11న అతడికి సోనమ్ వివాహం జరగ్గా.. 20న హనీమూన్ కోసం ఈ నవ దంపతులు మేఘాలయకు వెళ్లారు. ఆ తర్వాత కన్పించకుండా పోయారు. అదృశ్యమైన 11 రోజుల తర్వాత రఘువంశీ మృతదేహాన్ని సోహ్రాలోని ఓ జలపాతం సమీపంలో లోతైన లోయలో పోలీసులు గుర్తించారు. అతడి శరీరంపై కత్తి గాయాలు ఉండటంతో పోలీసులు హత్యగా అనుమానించారు. అనంతరం సోనమ్ కోసం గాలించగా.. ఉన్నట్టుండి ఆమె గాజీపుర్లో ప్రత్యక్షమైంది. ప్రియుడితో కలిసి ఆమె భర్తను హత్య చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

గత ప్రభుత్వం హంద్రీనీవా ప్రాజెక్టుకు రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు:మంత్రి నిమ్మల

కర్నూలు జిల్లాలో 2,294 పనుల కోసం రూ.2,014 కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

కల్లూరు, జూన్ 11, (రిపబ్లిక్ న్యూస్): కర్నూలు జిల్లాలో 2,294 పనుల కోసం రూ.2,014 కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా కల్లూరు మండలం తడకనపల్లెలో సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. గోరకల్లు రిజర్వాయర్ను పరిశీలించారు. ఇరిగేషన్ ప్రాజెక్టులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కర్నూలు జిల్లా అభివృద్ధికి కీలక పరిశ్రమలు తీసుకొచ్చామన్నారు. రూ.3,800 కోట్లతో హంద్రీనీవా ప్రాజెక్టు పనులు వేగవంతం చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం రూపాయి కూడా ఖర్చు పెట్టలేదని దుయ్యబట్టారు. 'పోలవరం- బనకచర్ల పూర్తయితే రాయలసీమ పచ్చగా మారుతుందన్నారు. దీన్ని ఓర్వలేక వైకాపా మొసలి కన్నీరు పెడుతోందని విమర్శించారు. "ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా డ్వాక్రా సంఘాలు తీసుకొచ్చి, మహిళలకు ఆర్థిక భరోసా కల్పించిన ఘనత చంద్రబాబుదే. వారి ఆరోగ్య భద్రత కోసం దీపం పథకం తీసుకొచ్చారు. కూటమి ప్రభుత్వం మహిళా పక్షపాత ప్రభుత్వం. అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే పెంచిన పింఛన్ అందించాం. వెయ్యి రూపాయలు పింఛన్ పెంచడానికి జగన్కు ఐదేళ్లు పట్టింది" అని నిమ్మల రామానాయుడు అన్నారు.

కాళేశ్వరం కమిషన్ ఎదుట ముగిసిన కేసీఆర్ విచారణ

బీఆర్కే భవన్ లో కాళేశ్వరం కమిషన్ ఎదుట మాజీ సీఎం, భారాస అధినేత కేసీఆర్ విచారణ ముగిసింది.

హైదరాబాద్, జూన్ 11, (రిపబ్లిక్ న్యూస్): బీఆర్కే భవన్లో కాళేశ్వరం కమిషన్ ఎదుట మాజీ సీఎం, భారాస అధినేత కేసీఆర్ విచారణ ముగిసింది. ఆయన్ను పీసీ ఘోష్ కమిషన్ సుమారు 50 నిమిషాల పాటు విచారించింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పలు ప్రశ్నలు సంధించింది. 115వ సాక్షిగా ఆయన్ను విచారించింది. విచారణ ముగిసిన అనంతరం కేసీఆర్ అభిమానులు, కార్యకర్తలకు అభివాదం చేస్తూ బీఆర్కే భవన్ నుంచి కారులో బయలుదేరి వెళ్లారు. ఆయన వెంట హరీశ్రావు ఉన్నారు.

ఆనకట్టల నిర్మాణంపై నిర్ణయం ఎవరిది.. ప్రశ్నించిన కమిషన్

విచారణ సందర్భంగా కేసీఆర్ను కాళేశ్వరం కమిషన్ 18 ప్రశ్నలు అడిగింది. ఆనకట్టల నిర్మాణానికి ఎవరు నిర్ణయం తీసుకున్నారని ప్రశ్నించింది. ఈక్రమంలో కాళేశ్వరం రీఇంజినీరింగ్ గురించి కేసీఆర్ వివరించారు. ఆనకట్టల నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం ఉందా అని కమిషన్ ప్రశ్నించింది. క్యాబినెట్, ప్రభుత్వ ఆమోదంతోనే ఆనకట్టల నిర్మాణం జరిగిందని కేసీఆర్ బదులిచ్చారు. వ్యాప్కోస్ సిఫారసుల ప్రకారమే నిర్మాణం జరిగిందని.. అన్ని అనుమతులు తీసుకున్నట్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అన్ని అంశాలతో ఉన్న పుస్తకాన్ని కమిషన్కు అందజేశారు. కాళేశ్వరం కార్పొరేషన్ గురించి కమిషన్ ఆరా తీసింది. కొత్త రాష్ట్రంలో నిధులను దృష్టిలో ఉంచుకొని కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లు కేసీఆర్ తెలిపారు. ప్రాజెక్టు వేగంగా పూర్తి చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. బ్యారేజీల్లో నీటి నిల్వ గురించి కేసీఆర్ను కమిషన్ అడిగింది. ఎంత నీరు నిల్వ చేయాలన్నది ఇంజినీర్లు చూసుకుంటారని కేసీఆర్ చెప్పారు. బ్యారేజీల నిర్మాణ స్థలం ఎంపిక, మార్పు సాంకేతికపరమైన అంశమన్నారు. నీటి లభ్యత దృష్టిలో ఉంచుకొని కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టినట్లు తెలిపారు. జీవో నంబర్ 45ను, ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ బుక్కు కమిషను అందజేశారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1754: స్కాటిష్ రసాయన శాస్త్రవేత్త జోసెఫ్ బ్లాక్ కార్బన్ డయాక్సైడ్ (CO2)ను కనుగొన్నాడు.
- 1866: ప్రస్తుత అలహాబాదు హైకోర్టు (ఆగ్రా హైకోర్టుగా) స్థాపించబడినది.
- 1897: బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడు రామ్ ప్రసాద్ బిస్మిల్ జననం (మ.1927).
- 1924: భారతీయ వ్యంగ్య చిత్రకారుడు అబు అబ్రహాం జననం (మ.2002).
- 1932: నాట్యావధాన కళాస్రష్ట ధారా రామనాథశాస్త్రి జననం (మ.2016).
- 1935: మొట్టమొదటిసారిగా ఎడ్విన్ ఆర్మ్‌స్ట్రాంగ్ అనే శాస్త్రజ్ఞుడు ఎఫ్.ఎమ్. రేడియో ప్రసారాన్ని ప్రజలకు ప్రదర్శించాడు. (చిత్రంలో)
- 1948: బీహార్ రాజకీయ నాయకుడు లాలూ ప్రసాద్ యాదవ్ జననం.
- 1983: భారతదేశ వ్యాపారవేత్త ఘనశ్యాం దాస్ బిర్లా మరణం (జ.1894).
- 1988: సాధారణ ప్రజా లైసెన్సు (జీ పీ యల్) అనే పేరును మొట్టమొదటిసారి ఉపయోగించడం జరిగింది
- 2013: భారతదేశ మాజీ కేంద్రమంత్రి, కాంగ్రెస్ నాయకుడు విద్యా చరణ్ శుక్లా మరణం (జ.1929).


కార్బన్ డయాక్సైడ్

ఆగ్రా హైకోర్టు

రామ్ ప్రసాద్ బిస్మిల్


అబు అబ్రహాం

ధారా రామనాథశాస్త్రి

ఎడ్విన్ ఆర్మ్‌స్ట్రాంగ్

లాలూ ప్రసాద్ యాదవ్

ఘనశ్యాం దాస్ బిర్లా

జీ పీ యల్


విద్యా చరణ్ శుక్లా

12 నిమిషాల్లో 'సారొస్తారా' సాంగ్.
ఇలాంటి పాటలేంటన్న వర్మ..!

మహేశ్ బాబు కథానాయకుడిగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బిజినెస్మెన్'. ఇందులోని 'సారొస్తారా' సాంగ్ మేకింగ్ వెనుక ఏం జరిగిందో తెలుసా?

కొన్ని పాటలు విన్న వెంటనే భలే నచ్చేస్తాయి. మరికొన్ని సినిమా చూసిన తర్వాత ఆకట్టుకుంటాయి. ఇంకొన్ని ఎప్పుడు... ఎక్కడ.. విన్నా మనల్ని హమ్ చేసేలా చేస్తాయి. అలాంటి వాటిలో 'సారొస్తారా' సాంగ్ ఒకటి. మహేశ్ బాబు కథానాయకుడిగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ 'బిజినెస్మెన్'. కాజల్ అగర్వాల్ కథానాయిక. తమన్ సంగీతం అందించిన ఇందులోని పాటలు యువతను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా 'సారొస్తారా' ఎవర్రీన్. ఈ పాటను కేవలం 12 నిమిషాల్లోనే తమన్, భాస్కర భట్ల కలిసి రెడీ చేశారంటే నమ్ముతారా? అవును మీరు చదివింది నిజమే. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తమన్ స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు. "బిజినెస్మెన్' షూటింగ్ కోసం అందరం గోవా వెళ్లాం. అప్పటికీ 'దూకుడు' హిట్ అయి మంచి జోష్లో ఉన్నాం. నేను కంపోజ్ చేసిన కొన్ని పాటల్లో ఎక్కువగా యాటిట్యూడ్ పదాలను వాడాను. ఒకరోజు పూరి జగన్నాథ్రి దగ్గరకు వెళ్లి, 'సర్.. మహేశ్ బాబుకు అమ్మాయిల్లో ఫుల్ ఫాలోయింగ్ ఉంది. సినిమాలో ఒక్క మెలోడీ అయినా పెడితే బాగుంటుంది' అని అన్నాను. 'అవునా! ఎక్కడ కుదురుతుంది? ఫలానా సీన్ లో అమ్మాయి నడుచుకుంటూ వస్తుంది కదా..! అక్కడ వచ్చేలా డిజైన్ చేసుకుందాం. నేను పది నిమిషాల్లో వస్తాను. నువ్వూ భాస్కరభట్ల వెళ్లి ఆ పాట సంగతి చూడండి' అన్నారు. ఇద్దరం కలిసి రూమ్కి వెళ్లి ట్యూన్ చేయడం మొదలు పెట్టాం. నేను 'తారత్తరుత్తారే.. రక్తత్తా రత్తారే..' అంటూ ట్యూన్ వినిపించాను. భాస్కర భట్ల వెంటనే 'సారొస్తారా' అని పాటను రాసి ఇచ్చేశారు. "10-12 నిమిషాల తర్వాత పూరి జగన్నాథ్రు, సుబ్బరాజు ఇద్దరూ రూమ్ వచ్చారు. వాళ్లకు బాగా నచ్చింది. ఆ తర్వాత రాంగోపాల్వర్మ వస్తే, ఆయనకు వినిపించాము. 'ఇలాంటి సినిమాలో సారొస్తారా.. వెళ్తారా.. పాటలేంటి? ఆటలాడుతున్నారా' అని అన్నారు. దీంతో పూరిగారు సందిగ్ధంలో పడ్డారు. బాల్ను మహేశ్ బాబు కోర్టులోకి నెట్టారు. మరుసటి రోజు 'దూకుడు' 100 రోజుల ఫంక్షన్ ఉంటే, అందరం వెళ్లాం. అక్కడ మహేశ్ బాబుకు ఈ పాట వినిపిస్తే, 'మైండ్ బ్లోయింగ్ తమన్' అన్నారు. దీంతో 'సారొస్తారా' ఉంచాలని నిర్ణయించాం. ఈ పాట సినిమాకు పెద్ద అసెట్ అయింది. తమకు బాగా డబ్బులు కూడా వచ్చాయని ఆడియో కంపెనీ కూడా చెప్పింది" అని తమన్ చెప్పుకొచ్చారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

అనుకున్న సమయం కంటే ముందుగా 'పంచాయత్' సీజన్ 4.. స్ట్రీమింగ్ ఎక్కడంటే!

ఓటీటీ ప్రేక్షకులకు నవ్వులు పంచిన సిరీస్ పంచాయత్. దీని నాలుగో సీజన్ అనుకున్న సమయం కంటే ముందే అలరించడానికి సిద్ధమైంది.

ఓటీటీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్న వెబ్ సిరీస్లలో 'పంచాయత్' ఒకటి. ఇప్పటికే దీని మూడు సీజన్లు వచ్చి అలరించగా ఇప్పుడు నాలుగో సీజన్ 'పంచాయత్ సీజన్ 4' సిద్ధమైంది. అనుకున్న సమయం కంటే ముందే దీన్ని విడుదల చేయనున్నట్లు టీమ్ ప్రకటించింది. మొదట ఈ సిరీస్ జులై 2 నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు మేకర్స్ వెల్లడించారు. తాజాగా జూన్ 24 నుంచి 'అమెజాన్ ప్రైమ్ వీడియో' వేదికగా ఇది సందడి చేయనున్నట్లు తెలిపారు. ఈ కొత్త సీజన్.. పంచాయతీ ఎన్నికలే ప్రధానంగా సాగనుందని తాజాగా విడుదల చేసిన ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. 'ఎన్నికల సీజన్ వచ్చేసింది. యుద్ధానికి ప్రారంభమవుతోంది' అంటూ ఫన్నీ డైలాగులు ఆకట్టుకుంటున్నాయి. గత సీజన్లలో ఉన్నట్టే ఇందులోనూ ఫుల్ కామెడీ ఉండనున్నట్లు తెలుస్తోంది. జితేంద్రకుమార్, నీనా గుప్తా, రఘువీర్ యాదవ్ ప్రధాన పాత్రల్లో దీపిక్ కుమార్ మిశ్రా, అక్షత్ సంయుక్తంగా తెరకెక్కించారు. ఉద్యోగావకాశాలు లేక ఓ మారుమూల గ్రామంలో పంచాయతీ సెక్రటరీగా జాయిన్ అవుతాడు ఇంజినీరింగ్ పూర్తి చేసిన అభిషేక్ త్రిపాఠి. అక్కడ అతడికి ఎదురైన అనుభవాలేంటన్నదే క్లుప్తంగా పంచాయత్ వెబ్ సిరీస్ కథాంశం. 2020లో సీజన్1, 2022లో సీజన్ 2, గతేడాదిలో మూడో సీజన్ విడుదలయ్యాయి. ఈ సిరీస్ తెలుగులో 'సివరపల్లి' పేరుతో రీమేక్ అయిన సంగతి తెలిసిందే.

రిపబ్లిక్ దినపత్రిక
9948814188,
9985876888
ప్రకటన
ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాప్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501
డోర్ నెం:46/181/బి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001
బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్

రిపబ్లిక్ స్పోర్ట్స్

ఆస్ట్రేలియా మీడియాకు అంత 'కంగారూ' ఎందుకో?!

ఆసీస్ జట్టుకు లార్డ్స్ మైదానంలో ప్రాక్టీస్ కోసం అనుమతి లభించలేదు. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియన్ మీడియా టీమ్ ఇండియా పై తన అక్కసు వెల్లగక్కింది.

భారత్, ఇంగ్లండ్ మధ్య అయిదు టెస్టు మ్యాచ్ల సిరీస్ జూన్ 20 నుంచి ప్రారంభం కానుంది. అలాగే నేడు (బుధవారం) లార్డ్స్ ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ పోరు జరగనుంది. అయితే కొన్నిరోజుల క్రితం ఆస్ట్రేలియా క్రికెట్ జట్టుకు లార్డ్స్ మైదానంలో ప్రాక్టీస్ కోసం అనుమతి లభించలేదు. దీనికి గల కచ్చితమైన కారణం ఏంటో తెలియనప్పటికీ.. ఇంగ్లండ్ టూర్లో ఉన్న భారత జట్టు కూడా అదే మైదానంలో ముందునుంచే ప్రాక్టీస్ సెషన్లో ఉందని తెలుస్తోంది. నిర్వాహకుల సమాచార లోపంతో కంగారూ జట్టుకు ఇబ్బంది తలెత్తితే.. ఆస్ట్రేలియన్ మీడియా మాత్రం టీమ్ ఇండియాపై తమ అక్కసు వెల్లగక్కింది. తమ టీమ్కు లార్డ్స్ ప్రవేశం లభించకపోవడానికి ముమ్మాటికీ భారతజట్టే కారణమంటూ నిరాధార ఆరోపణలు చేసింది. 'ఆస్ట్రేలియా జట్టు ఖర్చుతో టీమిండియా లార్డ్స్ ప్రాక్టీస్ చేస్తోంది' అంటూ విద్వేషపూరిత కథనాలు ప్రచురించింది. అయితే, కంగారూ జట్టుకు మొదట అనుమతి లభించనప్పటికీ ఆదివారం నుంచే లార్డ్స్ మైదానంలో ఆసీస్ ఆటగాళ్ళు ప్రాక్టీస్ చేసుకోగలిగారు. 'ఈ ఉదయం స్టేడియం ఉత్తమ వెర్షన్ ఇదే అని నేను భావిస్తున్నాను. చుట్టూ ఎవరూ లేరు. ఇది చాలా బాగుంది. ఈసారి నాగరికంగా సాగుతుందని నేను కచ్చితంగా అనుకుంటున్నాను' అని ఆసీస్ కెప్టెన్ కమ్మిన్స్ సైతం విపక్షాపూరిత వ్యాఖ్యలు చేశాడు. అలాగే అతడు ఇంగ్లండ్ టీమ్ను టార్గెట్ చేస్తూ కూడా మాట్లాడాడు. 'గతంలో యాషెస్ సిరీస్ మధ్యలో పరిస్థితులు చాలా వేడెక్కాయి. వారిలో చాలామంది పాఠం నేర్చుకుని ఉంటారని నేను భావిస్తున్నాను. ఈసారి వారు చాలా మర్యాదగా ఉంటారని నేను కచ్చితంగా అనుకుంటున్నాను' అని కమ్మిన్స్ అన్నాడు.

ఇంటి చిట్కాలు

రెగ్యులర్ అన్నం బదులు చిరుధాన్యాలు కలిపి వండి తినండి, బరువు పెరగడం నుంచి గుండె సమస్యల వరకూ మరెన్నో దూరం, ఏయే ధాన్యాలు కలపాలంటే

ఎన్ని టిఫిన్స్ చేసినా ఓ ముద్ద అన్నం తిననిదే కొంతమందికి తిన్నట్టుగా అనిపించదు. అందుకే, చివర్లో ఒక్కముద్దైనా అన్నాన్ని తింటారు. అలాంటి వారు అన్నాన్ని హెల్దీగా మార్చుకోవాలంటే ఏం చేయాలో తెలుసుకోండి.

ఆరోగ్యంపై అవగాహన పెరిగి చాలా మంది కూడా అన్నం బదులు చిరుధాన్యాలకి షిఫ్ట్ అవుతున్నారు. కానీ, ఇవి మొదట్లో బానే అనిపించినప్పటికీ రాన్రాను తినాలనిపించదు. దాంతో తిరిగి మళ్లీ నార్మల్ రైస్ తింటారు. అలా కాకుండా చిరుధాన్యాలు, బియ్యాన్ని బ్యాలెన్స్‌గా కలిపి వండుకుని తింటే బాగుంటుంది కదా. ఇప్పుడు చేసే రెసిపీలో అన్నీ చిరుధాన్యాలు కూడా కలుస్తాయి. సో, మరొకటి లేదనే బెంగ అవసరం లేదు. చిరుధాన్యాల్ని మన డైట్‌లో యాడ్ చేసుకోవాలంటే చాలా మందికి వాటిని నేరుగా తినడానికి ఇష్టపడరు. కానీ, వీటిని ఇలా అన్నంతో కలిపి తింటే ఆ తేడా తెలియదు. పైగా రుచిగా ఉంటుంది. అన్నం కూడా తిన్నట్టుగా ఉంటుంది. పైగా చిరుధాన్యాలని ప్రత్యేకంగా తినాల్సిన అవసరం లేదు. మరింకెందుకు ఇన్ని లాభాలున్న ఈ చిరుధాన్యాల అన్నాన్ని ఎలా తయారుచేసుకోవాలో తెలుసుకోండి.

కావాల్సిన పదార్థాలు

బియ్యం అరకప్పు
కొర్రలు 2 టేబుల్ స్పూన్లు
క్వినోవా 2 టేబుల్ స్పూన్లు
మొక్కజొన్న రవ్వ 2 టేబుల్ స్పూన్లు
తెల్లజొన్న రవ్వ 2 టేబుల్ స్పూన్లు
ఎర్ర గోధుమ రవ్వ 2 టేబుల్ స్పూన్లు
రాగి రవ్వ 2 టేబుల్ స్పూన్లుమనుషులని బట్టి పరిమాణాన్ని పెంచుకోవడం తగ్గించుకోవడం చేయొచ్చు.

తయారీ విధానం

ముందుగా ఓ గిన్నెలో బియ్యం, కొర్రలు, క్వినోవా, మొక్కజొన్న రవ్వ, తెల్లజొన్న రవ్వ, ఎర్ర గోధుమ రవ్వ, రాగి రవ్వ వేయాలి. దీనిని శుభ్రంగా కడగాలి. అయితే, మీ ఇంట్లో వ్యక్తుల్ని బట్టి పరిమాణాన్ని పెంచుకోవచ్చు. వీటన్నింటిని చక్కగా కడగాలి. తర్వాత కుక్కర్‌లో వేసి ఒకటికి 2 కప్పుల నీరు పోసి ఉడికించాలి.

మీకు నచ్చితే



ఇందులో మీకు నచ్చిన చిరుధాన్యాలని రవ్వలా చేసి కలుపుకోవచ్చు. దీనికోసం ఇంట్లోనే మిక్సీ పట్టుకోవచ్చు. గోధుమ రవ్వలా పల్స్ ఇస్తూ పడితే సరిపోద్ది. అదే విధంగా, నీరు ఎక్కువగా పోస్తే అన్నం మరీ మెత్తగా అవుతుంది. అలా కాకుండా సరిపడా నీరు పోయడం మంచిది. దీంతో అన్నం పొడిపొడిగా వస్తుంది. ఇందులో బియ్యం కూడా ఉంటాయి. కాబట్టి, కేవలం చిరుధాన్యాలు తిన్నట్లుగా ఉండదు. అన్నం కూడా పొడిపొడిగా ఉంటుంది.

ఎలా తినాలి

ఇలా ఉడికించిన అన్నాన్ని మనం పప్పు, రసం, సాంబార్, కూరలతో తినొచ్చు. చాలా రుచిగా ఉంటుంది. ఈ అన్నం మనకి అలవాటు అయితే నార్మల్ అన్నం తినాలనిపించదు. పైగా మనకి ఇందులోనే అన్నీ చిరుధాన్యాలు కూడా కలుస్తాయి కాబట్టి మనకి ఫైబర్, విటమిన్స్ అన్నీ కూడా అందుతాయి. ఎలాంటి గిల్టీ లేకుండానే అన్నాన్ని ఆస్వాదించొచ్చు. ఇలా వండిన రైస్‌ని తినడం వల్ల ఎన్నో లాభాలున్నాయి.

బరువు తగ్గేందుకు

చిరుధాన్యాల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఈ కారణంగా వీటిని తినగానే కడుపు నిండినట్లుగా ఉంటుంది. ఈ కారణంగా ఎక్స్ట్రాగా జంక్ ఫుడ్ తినరు. ఎలాంటి క్రేవింగ్స్ ఉండవు. పైగా గ్రెయిన్స్ తీసుకోవడం వల్ల మెటబాలిజం పెరుగుతుంది. ఈ కారణంగా బరువు ఈజీగా తగ్గుతారు.

ఎలా తినాలిజీర్ణ సమస్యలు



చిరుధాన్యాలు కలిపి వండిన బియ్యాన్ని తింటే ఇందులోని ఫైబర్ కంటెంట్ కారణంగా జీర్ణ సమస్యలు దూరమవుతాయి. మలబద్ధకం, అజీర్ణం వంటి దూరమవుతాయి. వీటిని తినడం వల్ల గట్ బ్యాక్టీరియా పెరుగుతుంది. బాడీలో హెల్దీ డైజెస్టివ్ మైక్రోబయామ్ పెరుగుతుంది. రెగ్యులర్‌గా జీర్ణ సమస్యలతో బాధపడేవారికి ఇది ఔషధంలా పనిచేస్తుంది.

డయాబెటిస్, క్యాన్సర్



గ్రెయిన్స్ తినడం వల్ల బ్లడ్ షుగర్ లెవల్స్ రెగ్యులేట్ అవుతాయి. షుగర్ ఉన్నవారికి ఈ అన్నం చాలా మంచిది. అదే విధంగా, కొన్ని అధ్యయనాల ప్రకారం గ్రెయిన్స్ తినడం వల్ల కొన్ని క్యాన్సర్స్ వచ్చే రిస్క్ తగ్గుతుంది. చిరుధాన్యాల్లో యాంటీ ఆక్సిడెంట్స్, ఫైటోన్యూట్రియెంట్స్ వంటివి ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్స్ బాడీలో సెల్యులార్ డ్యామేజ్ కాకుండా ఉంటుంది. గమనిక : ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి.